యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రపంచయోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు, విద్యార్థులు యోగాసనాలు వేసి, యోగా విశిష్టతను చాటి చెప్పారు. పలువురు మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు.



రాచపల్లిలో యోగా చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు



యోగాసనాలు చేస్తున్న వేములపూడి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు



కింతాడలో ఆకట్టుకున్న విద్యార్థినుల యోగాసనాలు

చోడవరం: పట్టణంలో పతంజలి యోగా శిక్షణ కేంద్రం, వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలోవిద్యార్థులు, యోగా శిక్షణ పొందేవారు, యోగాసనాలు వేశారు. పంతంజలి యోగా శిక్షణ కేంద్రం గురువు పుల్లేటి సతీష్ వివిధ ఆసనాలు వేసి అందర్నీ అబ్బుర పరిచారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె.రమణాజీ, విశాఖపట్నం యోగాచార్య సాంబశివరావు, వాసవీక్లబ్ జిల్లా అధ్యక్షుడు పి.వి. వరహాలరావు, కలగర్ల శేషు, చోడవరం అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి పసుమర్తి అశోక్, పుట్టా నరేష్, భోగవిల్లి గణేష్, వనిత క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. చోడవరం వాకర్స్ క్లబ్ ఆవరణంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు, వాకర్స్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో యోగా క్లబ్ ప్రతినిధి పప్పల రమణమూర్తి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం డిగ్రీ కాలేజీలో

చోడవరం రూరల్: అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలోని మూడు జాతీయ సేవా పథకం యూనిట్లు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ కేంద్రం సహకారంతో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు విధిగా కనీసం 20 నిమిషాల పాటు యోగా చేయాలన్నారు. అలా చేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి శ్రీనివాసరావు విద్యార్థులచే సూర్యనమస్కారాలు, కొన్ని యోగసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైఎస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, బి.లక్ష్మి, ఉపన్యాసకులు రావి రాణి, ఐ.వి.వి.సత్యవతి, ఎ.కృష్ణారావు, జి.వి.ప్రసాద్‌బాబు, సీఏ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

మాకవరపాలెం: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం మాకవరపాలెం, తూటిపాల తదితర పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. రాచపల్లి సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు ఆసనాలు వేశారు. కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ లలిత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది యోగాసానాలు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ఎల్. శివప్రసాదుపాత్రుడు, ఎంపీహెచ్ఈవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. వంటర్లపాలెంలో ఉపాధి కూలీలు యోగాసానాలు వేశారు. ఏపీవో వరహాలబాబు ఎంపీడీవో మీనాకుమారి, సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, ఉపాధి హమీ పథకం ఈసీ పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత

దేవరాపల్లి: విద్యార్థులు యోగాసనాలు వేయడం ద్వారా ఏకాగ్రత కలిగి చదువుల్లో రాణించవచ్చని ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలను చేయించారు. పీడీ కె. సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కింతాడ కేజీబీవీలో ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు ఆధ్వర్యంలో విద్యార్థినులు యోగా డే అక్షర రూపంలో వచ్చే నిల్చుని ఆకట్టుకున్నారు. అనంతరం పలు ఆసనాలు వేశారు.

యోగాతో ఒత్తిడి దూరం

మాకవరపాలెం: యోగాతో ఒత్తిడిని జయించవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఉపాధ్యాయులు జలుమూరి గిరిబాబు, దుబాసి గిరిబాబు తెలిపారు. యోగా దినోత్సవం సందర్భంగా అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య జీవితంలో ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన మెలకువలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల యోగాసనాలు

బుచ్చెయ్యపేట: దిబ్బిడి గ్రామంలోని ఎల్లమ్మ చెవురు గర్భంలో ఉపాధి కూలీలు యోగాసనాలు వేశారు. ఏపీవో మురళి,ఈసీ కొండాజీ, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం తదితరులు పాల్గొన్నారు. పి.భీమవరం సోమరాజు,పెదమదీన తివ్వ చెరువు,ఆర్. శివరాంపురంలో నక్కవారిబందలో కూడా ఉపాధి కూలీలతో యోగాసనాలు వేయించినట్టు ఏపీవో తెలిపారు.

రావికమతం: యోగా గురువు వరుగొండ శ్రీను ఆధ్వర్యంలో కొత్తకోట సెయింట్ మేరీస్ స్కూల్‌లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. టి.అర్జాపురం హైస్కూల్‌లో విద్యార్థులతో అక్కడి సీఆర్‌పీ రామారావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. కొత్తకోట,రావికమతం తదితర సచివాలయాలలో సిబ్బంది యోగాసనాలు వేశారు.

నర్సీపట్నంలో

నర్సీపట్నం: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్‌క్లబ్ సభ్యులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వరహాలనాయుడు, ఎంఎస్.ప్రసాద్ పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాజయోగ ఆర్మీ, అల్లాడ జగన్నాథం చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా వేడుకలు నిర్వహించాయి. యోగతో మానసిక ఒత్తిడిని అధికమించవచ్చనని యోగా గురువు లాలం రాజు తెలిపారు. ప్రముఖ వైద్యులు విజయశాంతి, డాక్టర్ శ్రీనివాసరావు, ట్రస్టు ప్రతినిధి రమేష్ పాల్గొని యోగాలో శిక్షణ పొందుతున్న సీనియర్స్, యోగా గురువు రాజును ఘనంగా సన్మానించారు. వేములపూడి ప్రభుత్వ హైస్కూల్‌లో యోగా వేడుకలను నిర్వహించారు. యోగా అవశ్యకత గురించి విద్యార్థిని, విద్యార్థులకు పి.డి.రవి వివరించారు.

రోలుగుంట: యోగాతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని కుసుర్లపూడి ఆరోగ్య ఉపకేంద్రం ఎంపీహెచ్ఎల్‌వో రమాకుమారి అన్నారు. కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని హెచ్ఎం మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆసనాలను వేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యావతి, సొంబశివరావు, జగ్గారావు, బార్గవి తదితరులు పాల్గొన్నారు.



వంటర్లపాలెంలో ఉపాధి కూలీలతో యోగాసనాలు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మీనాకుమారి



ఎ. కొత్తపల్లిలో హైస్కూల్‌లో విద్యార్థులతో యోగాసనాలు చేయిస్తున్న హెచ్ఎం



కె.జె.పురం పీహెచ్‌సీలో యోగాసనాలు వేస్తున్న ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు



కుసుర్లపూడి హైస్కూల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న ఎంపీహెచ్ఎల్‌వో



చోడవరం డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



కొత్తకోట స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



దిబ్బిడి చెరువులో యోగాసనాలు వేస్తున్న కూలీలు



నర్సీపట్నంలో యోగాసనాలు వేస్తున్న క్లబ్ సభ్యులు



నర్సీపట్నంలో శిక్షణ పొందుతున్న సీనియర్స్‌ను సన్మానిస్తున్న యోగా గురువు రాజు, అల్లాడ రమేష్

క్లుప్తంగా

పనుల్లో నాణ్యత లోపిస్తే నిధులు రికవరీ



సామగ్రిని తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి ప్రకాశరావు

మాకవరపాలెం: పనుల్లో నాణ్యత లోపిస్తే నిధులు రికవరీ చేస్తామని నాడు-నేడు పనుల ప్రత్యేక అధికారి ప్రకాశరావు స్పష్టం చేశారు. మండలంలోని జి.కోడూరు ఉన్నత, మాకవరపాలెం కస్తూర్బా పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణాలకు వినియోగిస్తున్న సామగ్రిని పరిశీలించారు. పనుల్లో పారదర్శకత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నరేష్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసేవారికి గుర్తింపు



టీచర్‌ను సత్కరిస్తున్న హెచ్ఎం, తదితరులు

మాకవరపాలెం: అంకిత భావంతో పనిచేసే వారికి ఎక్కడ ఉన్నా గుర్తింపు లభిస్తుందని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం అచ్యుతరామయ్య అన్నారు. ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళుతున్న ఏడుగురు ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ విధులు నిర్వహించినా విద్యార్థులు ఉన్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌతమి లలిత కళ శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు



శృంగవరం జగనన్న లేఅవుట్‌లో బోరు వేస్తున్న సిబ్బంది

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని శృంగవరం సర్పంచ్ ఉలబాల శ్రీనివాస్ అన్నారు. మండలంలో శృంగవరం సమీపంలో గల జగనన్న లేఅవుట్‌లో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సర్పంచ్ ఆధ్వర్యంలో బోరు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రత్యేక శ్రద్ధతో గెడ్డపై రూ.25లక్షలతో వంతెన నిర్మించినట్టు చెప్పారు. వంతెన నిర్మాణం ద్వారా జగనన్న కాలనీకి రోడ్డు సౌకర్యం కలిగిందని చెప్పారు. హౌసింగ్ జేఈ జోగారావు , వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం



చింతపాకలో రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న ఏవో,సర్పంచ్

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. చింతపాక రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై వరి విత్తన ప్యాకెట్లను బుధవారం ఆయన అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగానే ఆర్‌బీకేలో నమోదు చేసికుని విత్తనాలు పొందవచ్చని చెప్పారు. సర్పంచ్ గొలజాన శ్రీను, నాయకులు నాయుడు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయుడికి సన్మానం

కె.కోటపాడు : కొరువాడ జగన్నాథపురం పాఠశాల నుంచి బదిలీ అయినా ఉపాధ్యాయుడు ఎం.ఉమామహేశ్వరరావును బుధవారం హెచ్ఎం పోతల నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు.

జగనన్న సురక్షలో ఉచితంగా సేవలు



తైపురం సచివాలయంలో జగనన్న సురక్షపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో జయరాం



చింతలపూడిలో అవగాహన కల్పిస్తున్న సెక్రటరీ లింగన్న



మాట్లాడుతున్న ఎంపీడీవో మీనాకుమారి

బుచ్చెయ్యపేట: జగనన్న సురక్షలో దరఖాస్తు చేసికున్న ప్రతి లబ్ధిదారుడికి ఉచితంగా సేవలు అందించాలని అనకావల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. తైపురం గ్రామ సచివాలయాలన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా తైపురం సచివాలయాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసినట్టు చెప్పారు. జగనన్న సురక్షలో భాగంగా ప్రభుత్వం 11 సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తోందన్నారు. కుల,నివాస ధ్రువీకరణ పత్రాలు,జనన,మరణ ధ్రువీకరణ,ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం,కొత్త రేషన్ కార్డు,కార్డులో ఉన్న సభ్యులు విభజన చేయడం,కౌలు గుర్తుంపు కార్డు,ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, వివాహ రిజిస్ట్రేషన్ తదితర సేవలన్నీ ఎటువంటి రుసుము వసూలు చేయకుండా ప్రజలకు ఉచితంగా అందిస్తామన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు,ఎంపీడీవో సువర్ణరాజు,ఈవోపీఆర్డీ విజయలక్ష్మి,సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

గొలుగొండ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. మండలంలోని ఏఎల్‌పురంలో అమలు జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ సిబ్బందితో సమావేశమయ్యారు. లబ్ధిదారుల ఇళ్ల వెళ్లి మాట్లాడారు. అనంతరం గొలుగొండ ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నూరుశాతం అమలు జరగాలని, అందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

దేవరాపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని చింతలపూడి పంచాయతీ సెక్రటరీ ఎల్.లింగన్న అన్నారు. చింతలపూడి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మల సమక్షంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు.

రెండు బృందాలు

మాడుగుల: జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేసేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ టీములతో కలిసి ఎంపీడీవో, తహసీల్దార్ పర్యటిస్తారని చెప్పారు.

వీఆర్పీ తీరుపై ఉపాధి కూలీల నిరసన

రోలుగుంట: దొంగ మస్తరు వేసి, పనులకు హాజరవుతున్న కూలీలకు ఆర్థికంగా నష్టం కలిగిస్తున్న బుచ్చింపేట వీఆర్పీ అనంతపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉపాధికూలీలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని కలవల చెరువు, చాకలి చెరువు, వంకబందలో 27 మంది మేట్‌ల ఆధ్వర్యంలో జట్టుకు సుమారు 40 మంది చొప్పున కూలీలు పనిచేస్తున్నట్టు చెప్పారు. వీఆర్పీ తన సొంత జాగీరులా వ్యవహరిస్తూ తమను హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోగస్ మస్తర్లు వేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్టు వారు ఆరోపించారు. ప్రశ్నిస్తే తమను ఇబ్బందులకు గురిచేయడమే కాకండా దురుసుగా ప్రవస్తున్నారని ఆరోపించారు. ఆమె వ్యవహారశైలిపై ఈ నెల 5న కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. ఈ నెల 19 సోమవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో మరోసారి ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని పులిగా వెంకటరమణ ,రెడ్డి మల్లిక, మాకిరెడ్డి అప్పలనాయుడు, వబ్బలరెడ్డి గంగరాజు తదితరులు డిమాండ్‌చేశారు. దీనిపై ఏపీవో కోసూరి సూర్యామణిని 'సాక్షి' సంప్రదించగా ఎంపీడీవో ప్రభాకరరావు సెలవులో ఉన్నారని, ఈ నెల 27న గ్రామంలో విచారణ చేస్తామని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఉపాధికూలీలు

విద్యార్థుల ఉన్నతికి ఆణిముత్యాలు దోహదం



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్ఎం వేణుగోపాల్

రోలుగుంట: ఆణిముత్యాలు కార్యక్రమం విద్యార్థుల ఉన్నతికి ఎంతగానో దోహదపడుతుందని హెచ్ఎం వేణుగోపాల్ అన్నారు. మండలం కొవ్వూరు జెడ్పీ ఉన్నతి పాఠశాలలో బుధవారం ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా పదిలో అధిక మార్కులు సాధించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు, మెడల్స్‌ను అందజేశారు.సీనియర్ ఉపాధ్యాయడు దేముడుబాబు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షర్యాతపై క్విజ్‌పోటీ

రోలుగుంట: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీ నిర్వహించారు. రోలుగుంటకు చెందిన షేక్ అనుసార్ కరీం(ప్రథమ),బి.బి.పట్నం హైస్కూల్‌కు చెందిన దివ్య(ద్వితీయ), కొమరవోలు హైస్కూల్‌కు విద్యార్థినికి వరలక్ష్మి (తృతీయ) విజేతలుగా ఎంపికయ్యారు. విజేతలకు బ్రాంచి మేనేజర్ నందిని ప్రశంసాపత్రాలను అందజేశారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు

- పంచాయతీ రాజ్‌శాఖ ఈఈ నగేష్‌బాబు

నాతవరం: ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.నగేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సచివాలయ,ఆర్‌బీకే, హెల్త్‌క్లినిక్‌ల నూతన భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించినట్టు చెప్పారు. చాలా మంది బిల్లులు తీసుకుని భవన నిర్మాణాలు పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారి పట్ల కలెక్టరు సీరియస్‌గా ఉన్నారని, వచ్చే నేలాఖరువు లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. మండలంలో సచివాలయాల వారీగా క్షేత్రస్థాయిలో చేసిన పనులు వివరాలను సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులు చురుగ్గా సాగుతున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో హనుమంతరావు, పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ సచివాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.



భవన నిర్మాణాలపై సూచనలు చేస్తున్న పంచాయతీరాజ్‌శాఖ ఈఈ నగేష్‌బాబు

క్విజ్ పోటీల్లో ఎ.కొత్తపల్లి విద్యార్థి ప్రతిభ

దేవరాపల్లి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఎ.కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థి షణ్ముఖనాయుడు తృతీయ స్థానంలో నిలిచినట్టు స్థానిక హైస్కూల్ హెచ్ఎం వై. స్వర్ణలత తెలిపారు.ఈ మేరకు షణ్ముఖనాయుడును స్థానిక పాఠశాలలో అభినందించారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న షణ్ముఖనాయుడు

మత్స్య, కూర్మావతారాల్లో దర్శనం



చోడవరంలో మత్స్యావతారంలో దర్శన మిచ్చిన జగన్నాథస్వామి



మాడుగులలో కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

చోడవరం: రథయాత్రలో భాగంగా స్థానిక కేశవస్వామి ఆలయంలోని ఉపాలయంలో వేంచేసి జగన్నాథస్వామి బుధవారం స్వామి మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టుబోర్డు చైర్మన్ అలమండ ఈశ్వరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, ఆలయ మాజీ చైర్మన్ ఉప్పలబాబు పాల్గొన్నారు.

మాడుగుల: జగన్నాథ రథయాత్రలో భాగంగా బుధవారం కూర్మావతారంలో జగన్నాథుడు భక్తులు దర్శనమిచ్చారు. సాయంకాలం ఏర్పాటు చేసిన హరి భజనలులో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన టెన్త్ విద్యార్థులకు సత్కారం



అవార్డులతో గవరవరం విద్యార్థులు



జి. అగ్రహారంలో విద్యార్థినికి నగదు అందజేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: పదవ తరగతి పరీక్షల్లో వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సలాది సాయిశ్రీ, మజ్జి ద్రాక్షాయణి, బి.జ్యోత్స్నలకు బుధవారం నగదు పారితోషికం, పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్, సర్పంచ్ చప్పగడ్డి మాణిక్యం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చప్పగడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా జి. అగ్రహారం హైస్కూలులో అత్యధిక మార్కులు సాధించిన ఆర్లె ఊర్మిళ,కర్రి సునీత, ముచ్వల హేమంత్‌కు బుధవారం నగదు బహుమతులు అందజేశారు.హెచ్ఎం వడ్లమాని ఉమాశంకర్, సర్పంచ్ నందారపు మంగమ్మ, పానాపతి, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.